నవోదయకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు పట్టణంలో శ్రీ మోదమాంబ హైస్కూల్లో చదువుతున్న విద్యార్థిని బోయపల్లి ప్రవీణ శ్రీవిద్య నవోదయ పాఠశాలలో 9వ తరగతికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.నాగమణి శుక్రవారం తెలిపారు. విద్యార్థినిని ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సింహాచలం, లలిత కుమారి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ, 2025-26 విద్యాసంవత్సరానికి గాను నవోదయ కు జరిగిన పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాల యాజమాన్యం చేస్తున్న కృషిని తల్లిదండ్రులు, పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రవీణ శ్రీవిద్య

గిరిజన గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ఆందోళన చేపడుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు

ప్రజాశక్తి -ముంచింగి పుట్టు : సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ప్రజా చైతన్య యాత్ర లో భాగంగా మండలంలోని 13 పంచాయతీలలోని 106 గ్రామాలలో ఆ పార్టీ మండల నేతలు పర్యటించారు. గిరిజన గ్రామాల్లోని సమస్యలను పరిష్కారం చేయాలని శుక్రవారం పలు గ్రామాల నుండి కదలి వచ్చిన గిరిజనులు జడ్పీ గెస్ట్ హౌస్ నుండి తహసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణం వద్ద నిరసన తెలిపారు. తహసిల్దార్ నర్సమ్మ, ఇన్చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, హౌసింగ్ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు సమర్పించారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, పీఎం జన్మన్ గృహాల బిల్లుల మంజూరుకు హౌసింగ్ శాఖ, సచివాల ఇంజనీరింగ్ అసిస్టెంట్ డబ్బులు వసూలు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంచెలను పాల్గొని వారిని శాఖ పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని ప్రతి లబ్దిదారుడి నుంచి బిల్లు మంజూరుకు ఐదు నుండి పదివేలు వసూలు చేస్తున్నారని, రాజకీయ నాయకులు దీన్ని ఆసరా తీసుకొని ప్రోత్సహిస్తున్నారన్నారు. మండల వ్యాప్తంగా జల్ జీవన్ పేరుతో 52 కోట్లు ప్రజల సొమ్ము దుర్వినియోగమైనా ఉన్నత అధికారులు పట్టించుకోలేదన్నారు.మండల కేంద్రంలోని సంత బయలు కాలనీ, ఇందిరా కాలనీ, దుర్గా, మినుములు పుట్టు కాలనీలో తాగునీరు సరఫరా నిలుపుదల చేసి సుమారు రెండు నెలలు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

ఆదివాసి గిరిజన మహిళా మండలి మండల అధ్యక్షురాలు మాట్లాడుతూ, వినతులు ఇచ్చిన అధికారులకు పట్టడం లేదని ఆగ్రహించారు. పీఎం ఏజే 2.0 పథకంలో గృహ లబ్దిదారులకు 10 లక్షలు మంజూరు చేయాలన్నారు. గృహల సర్వే వేగవంతం చేసి బిల్లులు మంజూరు చేసి ఆదివాసి గిరిజనులందరికి న్యాయం చేయాలన్నారు. జీడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, జీసీసీ కొనుగోలు చేసే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కొండపోడు పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. పసుపు రైతులకు న్యాయం చేయాలని, దళారుల చేతుల్లో ఆదివాసులు మోసపోతున్నారని తెలిపారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఐకాయి వేతనాలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, బీటీ రోడ్డు, బ్రిడ్జిలు, వంతెనలు, పాఠశాల భవనాలు, అంగన్వాడి కేంద్రాల భవనాలు, నిర్మాణాలు చేపట్టి గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడాలని కోరారు. నూతన రేషన్ కార్డులు పంపిణీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు పది నెలలు పూర్తయినప్పటికీ కనీసం వృద్ధాప్య, వితంతు, వికలాంగ పింఛన్ల మంజూరు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎంఎం శ్రీను, నర్సింగ్ పడాల్, శంకర్రావు, నరసయ్య, నారాయణ, జీనబంధు, వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ముస్లిములు

ముస్లిముల ఆందోళన

ప్రజాశక్తి-చింతపల్లి: వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లు 2024ను వ్యతిరేకిస్తూ చింతపల్లి మండల కేంద్రంలోని మజ్జిద్ ఏ క్యూబా వద్ద శుక్రవారం స్థానిక ముస్లింలు నిరసన చేపట్టారు. ఆలిండియా పర్సనల్ లా బోర్డ్ పిలుపు మేరకు ఈ నిరసన నిర్వహించామని మత పెద్దలు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వక్ఫ్ బోర్డు పేరిట ఉన్న ముస్లిం ఆస్తులను కేంద్ర ప్రభుత్వం సవరించే ప్రయత్నం చేస్తుండడం, దీనికి రాష్ట్ర ప్రభుత్వం మద్దతు తెలిపేందుకు యత్నించడం సరికాదని వారు తెలిపారు.ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మత పెద్దలు వెల్లడించారు. శుక్రవారం ముస్లింలంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజుకు హాజరయ్యారు. వక్ఫ్ బోర్డు సవరణను నిరసిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈనెల 29న విజయవాడలో రాష్ట్రవ్యాప్తంగా ముస్లింలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు మత పెద్దలు తెలిపారు. మైనారిటీల హక్కులను కాపాడేందుకు అన్ని రాజకీయ, మతపరమైన సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాలని వారు పిలుపునిచ్చారు.

జి.మాడుగుల: ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు స్థానిక మసీదులో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రోడ్డుపై పాడితో ఉన్న మృతదేహం

అంతిమ యాత్రపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి-ఎటపాక

మండలంలోని గౌరిదేవిపేట గ్రామంలో కొప్పుల పల్లాయమ్మ అంతిమ యాత్రపై తేనెటీగలు దాడి చేశాయి. అంత్యక్రియలకు తీసుకెళ్తున్న సుమారు 40 మందిపై తేనెటీగలు దాడి చేయడంతో మృతదేహాన్ని మార్గమధ్యలో రోడ్డుపై వదిలి బంధువులు పరుగులు పెట్టారు. తేనెటీగల దాడిలో గాయపడ్డ వారికి గౌరీదేవి పేట పిహెచ్సిలో చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన కొప్పుల వెంకటేశ్వరావు, ముత్యాల నరేష్, చంద్రశేఖర్‌ను మెరుగైన చికిత్స కోసం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

భూసార పరీక్షా పత్రాలు అందిస్తున్న దృశ్యం

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామ సచివాలయం ఆవరణలో ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు భూసార పరిరక్షణ (నేల ఆరోగ్య) అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటిఎంఎ పిడి వై.జ్యోతిర్మయి మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు, రైతులకు భూసార పరీక్షల వాటి ప్రాధాన్యత, భూసార పరీక్ష కొరకు మట్టి నమూనాల సేకరించే విధానాన్ని తెలియజేశారు. మట్టి నమూనాలు స్వయంగా విద్యార్థులు సమక్షంలో సేకరించి చూపించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంఎం.సువర్ణ కుమారి మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షల విశ్లేషణ కోసం 50 మట్టి నమూనాలను సేకరించినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య పాఠశాలకు ఒక మినీ భూసార పరీక్షల కేంద్రం కేటాయించడం జరిగిందని తెలిపారు. 50మట్టి నమూనాలు పరీక్ష చేయగా వచ్చిన ఫలితాలను భూసార పరీక్షా పత్రాలు (సాయిల్ హెల్త్ కార్డుల)ను ఈ గ్రామసభలో రైతులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య విద్యార్థులు, రైతులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు

మోదకొండమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు, :- అధికారులు, ఉత్సవ కమిటీ పరస్పర సహాయ సహకారాలతో మోదకొండమ్మ గిరిజన ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన మోదకొండమ్మ ఉత్సవాలపై మొదటి దఫా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే నెల 11,12,13 తేదీలలో నిర్వహించ నున్న మోదకొండమ్మ ఉత్సవాలు విజయవంతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జిల్లా పేరు ప్రతిష్టలు పెంపొందించేందుకు ఉత్సవాలు వేదికగా నిలవాలని కోరారు. భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత, ఆధ్యాత్మిక వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలన్నారు. గతంలో గుర్తించిన లోపాలు అధిగమించడానికి వీలుగా వివిధ కోర్ కమిటీలను ఈ సందర్భంగా కలెక్టర్ ప్రకటించారు. ఆయా ప్రాంతాలలో తాగు నీటి శిభిరాలు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ కమిటీ 24 గంటలు షిఫ్ట్ పద్ధతిలో ఆ మూడు రోజులు పని చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెడికల్ క్యాంపులకు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ ఏర్పాట్లు చూడాలని ఆదేశించారు.

ఎస్పీ అమిత్ బర్ధర్ మాట్లాడుతూ, క్రౌడ్ మేనేజ్మెంట్ లో సాంకేతికతను వినియోగించడం జరుగుతుందని, డ్రోన్లు, సిసి టివి కెమరాలతో నిరంతర నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు., స్మార్ట్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్థానిక శాసన సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, ఎక్కడా అశ్లీలతకు తావు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, 2014 నుండి శ్రీ మోదకొండమ్మ ఉత్సవాలను రాష్ట్ర పండగగా నిర్వహిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేస్తుందని, ఈ ఏడాది కూడా కోటి రూపాయలు మంజూరుకు ప్రతిపాదనలు పంపించాలని సూచించారు. ఈ సమావేశంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎఎస్పి ధీరజ్, డిఆర్ఓ కె.పద్మలత, స్థానిక సర్పంచ్ కె.ఉషారాణి, అన్ని విభాగాల జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు పి. కృష్ణా రావు, కోశాధికారి ఎస్. రామకృష్ణ, సభ్యులు బి. వేంకట రమణ, కెజియా రాణి, కె. సురేష్ కుమార్, కె. ప్రశాంత్, త్రినాద్ పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నాయకులు

విద్యుత్ భారాలపై సిపిఎం నిరసన

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం విద్యుత్ సబ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపరీతంగా విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై భారం పెట్టడం సరికాదన్నారు. 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు మారుతున్నా పాలకుల విధానాల్లో మాత్రం మార్పు లేదన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు పి బాలదేవ్, సుంకరమెట్ట సర్పంచ్ జి.చినబాబు, మార్కండ్, జోయో, కె.రమేష్, నాగేంద్ర, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న క్రైస్తవులు

పాస్టర్లపై దాడి హేయం

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక పరిశుద్ధ మందిరం ఆవరణలో అరకు నియోజకవర్గం హుకుంపేట మండల ఫెలోషిప్ ఆధ్వర్యంలో దైవ సేవకుల సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన ప్రముఖ పాస్టర్ ప్రవీణ్ పగడాల అనుమానాస్పదంతో మృతి చెందిన ఘటన పై స్పందించిన అరకు నియోజకవర్గం హుకుంపేట మండల ఫెలోషిప్ దైవ సేవకులందరూ శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. అరకు నియోజకవర్గం ఫెలోషిప్ అధ్యక్ష , కార్యదర్శులు వి.మోజెస్,కే.జేమ్స్, హుకుంపేట మండల ఫెలోషిప్ అధ్యక్ష కార్యదర్శులు కె.ప్రేమ్ కుమార్, సుధాకర్ ఆధ్వర్యంలో దైవ జనులు ప్రార్థనలు చేశారు. ప్రవీణ్ పగడాల చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్రైస్తవ దైవ సేవకుల పైన దాడికి పాల్పడడం హేయమైన చర్యని వారు ఖండించారు. భారతదేశంలో ముస్లిం, క్రైస్తవులు, హిందువులు అందరు సమానులని, కలిసికట్టుగా ఉన్న తరుణంలో మైనారిటీలపై హత్యకు దిగడం ప్రజాస్వామ్యం వ్యవస్థలు విచ్చినం చేయడమే వారు పేర్కొన్నారు. ఆయన మరణ వార్త వినడంతో ఆంధ్ర తెలంగాణ కాకుండా భారతదేశమంతా దిగ్భ్రాంతికి గురి అయ్యిందన్నారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చేంతవరకు ఎటువంటి నిరసనలు, ర్యాలీలు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో దైవజనులు ఎస్.బాలకృష్ణ, ప్రసాద్, యోహాను, డేవిడ్, జాన్ వింకిల్, వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు సోషల్ మీడియా కన్వీనర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభిస్తున్న సిఐ, నాయకులు

తాగునీటి కుళాయిలు ప్రారంభం

ప్రజాశక్తి హుకుంపేట : యువకులు చెడు వ్యసనాల నుండి దూరంగా ఉండాలని సిఐ ఎస్ సన్యాసినాయుడు సూచించారు. శోభకోట పంచాయతీ కంగండ్వా గ్రామంలో కమ్యూనిటీ పోలీసు కార్యక్రమం ఎస్సై ఎల్.సురేష్ ఆధ్వరాయ్న శుక్రవారం నిర్వహించారు. అనంతరం ప్రతి ఇంటికి మంచినీటి సరఫరా కార్యక్రమంలో భాగంగా తాగునీటి సరఫరా చేసే కుళాయిలను సంయుక్త గా ప్రారంభించారు. స్థానికంగా ఉన్న మహిళలకు చీరలను, యువతకు వాలీబాల్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, గంజాయి రవాణా చేసిన వారిని కఠినమైన కేసు నమోదు చేసి జైలు పంపించడం జరుగుతుందన్నారు. రోడ్డుపై వాహనాలను నడిపేటప్పుడు రోడ్డు భద్రత నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ కృషి చేయాలన్నారు. హెల్మెట్స్ ను ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కూడా రాజబాబు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు పాల్గొన్నారు.

విడివికెల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు

ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని జీడిమామిడి రైతులు దళారుల దగ్గర మోసపోకుండా ఎక్కడికక్కడ వందన్ వికాస కేంద్రాల (విడివికె) ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేయనున్నట్లు రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏడు మండలాలకు సంబంధించిన వందన్ వికాస కేంద్రాల అధ్యక్షులు, వెలుగు ఏపీడి, వెలుగు డిపిఎంలు, వెలుగు ఏపియంలకు వందన్ వికాస కేంద్రాల ద్వారా జీడి పిక్కల కొనుగోలుపై శుక్రవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీడి పిక్కల ప్రాసెస్ ఫ్యాక్టరీ రంపచోడవరంలో ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో మాట్లాడినట్లు చెప్పారు. ఏజెన్సీలోని అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు పంపే విధంగా తగు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. విడివికెలకు జీడిపిక్కలు అమ్మే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈనెల 30న రంపచోడవరంలో జీడి పిక్కల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం మాట్లాడుతూ జీడిపిక్కలు కొనుగోలు చేయడానికి విడీవీకేలకు ఐటీడీఏ ద్వారా నిధులు సమకూర్చుతామన్నారు. కొనుగోలు చేసిన జీడిపిక్కలను ప్రాసెసింగ్ అనంతరం మార్కెట్‌కు పంపిస్తామన్నారు. జీడిపిక్కల ద్వారా వచ్చిన ఆదాయం విడివికె సభ్యులకు సమానంగా పంచనున్నట్లు తెలిపారు. విడివికెల సభ్యులకు ఒక యాప్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా జీడిపిక్కల లావాదేవులు ఎప్పటికప్పుడు అప్లోడ్ చేసుకొనే విధంగా వెసులుబాటు కల్పిస్తామని పేర్కొన్నారు. విడివికెల ద్వారా జీడి పిక్కలు, పసుపు, చింతపండు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. అన్ని మండలాల్లోనూ విడివికెల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. జీడిపిక్కల రైతులు తూకాల్లోనూ, దళారుల వద్ద మోసపోకుండా ఐటీడీఏ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతి వీడీవీకేకు బ్యాంక్ అకౌంట్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఏజెన్సీలో ప్రస్తుతం 114 వందన్ వికాస కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా జీడి పిక్కల రైతులకు, విడివికెల అధ్యక్షులకు ఎప్పటికప్పుడు సూచనలు సలహాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపిడి యస్.డేగలయ్య, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, డీపీయంలు అపర్ణ, పరమేశ్వరరావు, వెలుగు యాంకర్ పర్సన్ రామరాజు, ఏపిఎంలు, విడివికె అధ్యక్షులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న ఐటిడిఎ పిఒ సింహాచలం, ఎమ్మెల్యే శిరీషాదేవి

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థినులు, నిర్వాహకులు

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవిపట్నం మండలం, ఇందుకూరు పేట జడ్పీ హైస్కూల్లో పోక్సో చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కల్పించారు. రాజమహేంద్రవరం డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మండల న్యాయ సేవాధికార సంస్థ రంప చోడవరం పారా లీగల్ వాలంటీర్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ ఇందుకూరుపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థునుకు బాల్య వివాహల పై, పోక్సో చట్టంపై, బ్యాడ్ టచ్ గుడ్ టచ్ పై, బాల్య కార్మిక నిర్మూలన వ్యవస్థపై అవగాహన కల్పించారు. పూర్తి వివరాలకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర, అరగంటి వీరభద్రారెడ్డి, తాలూరి రామిరెడ్డి, వై.నాగేశ్వరరావు, విద్యార్థునులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో దొరికితే కఠిన చర్యలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మత్తు పదార్థాలతో దొరికితే కఠిన చర్యలు తప్పవని జడ్డంగి ఎస్సై చినబాబు హెచ్చరించారు. మండలంలోని లోదొడ్డి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్డంగి ఎస్సై చినబాబు మాట్లాడుతూ ప్రజలు, ముఖ్యంగా యువత గంజాయి, సారా, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని హితవుపలికారు. మత్తుపదార్థాల వల్ల జీవితాన్ని కోల్పోవడమే కాక వారి కుటుంబం కూడా చిన్నాభిన్నం అయ్యే ఆస్కారం ఉంటుందని తెలిపారు. మత్తు పదార్థాలను సేవించడం వల్ల విచక్షణ కోల్పోయి నేరాలకు కూడా పాల్పడే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మత్తు పదార్థాలు అమ్మడం లేదా కొనుగోలు చేయడం వంటి పనులు చేస్తూ పట్టుబడితే జైలుశిక్ష పడుతుందని, జీవితం నాశనమవుతుందని తెలిపారు. కనుక డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని గ్రామస్తులను సూచించారు. కార్యక్రమంలో జడ్డింగ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్డంగి ఎస్ఐ చినబాబు

ఇకెవైసి కోసం వచ్చిన పిల్లలు

పిల్లలకు ఇకెవైసి అవస్థలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ పరిధిలో గోపవరం గ్రామంలో జిసిసి సేల్స్‌మెన్ పోటుకూరి గోపాలకృష్ణ పిల్లలకు రేషన్ కార్డు ఇకెవైసి చేయించారు. కొంతమందికి ఇకెవైసి కాగా, మరికొంతమంది పిల్లలకు అవలేదు. ఇకెవైసి కాని వారే ఎక్కువ మంది ఉన్నారు. దీని పరిస్థితి ఏమిటని అధికారులకు తెలియజేస్తామని సేల్స్‌మెన్ గోపాలకృష్ణ తెలిపారు. ఐదేళ్ల లోపు పిల్లలకు అసలు ఇకెవైసి తంబ్ కావడం లేదని, దీంతో వాళ్ళ తల్లిదండ్రులతో తంబ్ వేయించినా కూడా అవలేదని చెబుతున్నారు. తక్షణమే అధికారులు దీనిపై దృష్టి పెట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా?
అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ : 9490099125	పూర్ణమార్కెట్ : 9490099676
మధురవాడ : 8008596645	జగదాంబ : 9490099434
గాజువాక : 9849392359	జివియంసి : 9490099483
అనకాపల్లి : 8008736188	ద్వారకానగర్ : 9490099672
చోడవరం : 9490099141	కంచరపాలెం : 9490099135
నర్సీపట్నం : 9440280411	మాదవధార : 9490099675
పాడేరు : 9490099142	
రంపచోడవరం : 9440165617	

తాగునీటి బోర్లు ఏర్పాటు

బోర్లు ప్రారంభిస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-చింతపల్లి:ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహాయంతో చింతపల్లి సాయి నగర్కు చెందిన యువజీవన సేవ సంఘం ఆధ్వర్యంలో చింతపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మల్లవరం, పెదబరడ పంచాయతీ చినబరడ గ్రామాలలో చేతిపంపు బోర్లను ఏర్పాటు చేశామని యువ జీవన సేవా సంఘం అధ్యక్షుడు కదుల్ల మధుసూదనరావు తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాలలో స్థానిక గ్రామస్తులతో కలిసి తాగునీటి చేతిపంపు బోర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ, తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాలలో తమ వంతుగా ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ ఆర్గనైజేషన్ ఆర్థిక సహాయంతో బోర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు తమను సంప్రదిస్తే చేతిపంపు బోర్ల నిర్మాణానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ, యువజీవన సేవా సంఘం, ఇంపాక్ట్ ఇనిషియేటివ్స్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

లోగోను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పాడేరు: అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) 17వ జాతీయ మహాసభల లోగోను శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులోని కాఫీ బోర్డ్ హౌస్ లో ఆవిష్కఇరంచారు. ఈ సందర్భంగా మాజీ యువజన సమాఖ్య నాయకులు కామ్రేడ్ అమర్ మాట్లాడుతూ 2025 మే 15 నుండి 18 వరకు తిరుపతి లో జరుగు జాతీయ మహాసభల్లో యువత పెద్దయెత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.యువలో అభ్యుదయ భావజాలం, లౌకిక, ప్రజాస్వామిక ఆలోచనలను, నైతిక విలువలను, మానవత్వాన్ని పెంపొందించడానికి ఎ.ఐ.వై.ఎఫ్.నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన నరేంద్ర మోడీ ఆ హామీని విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మువ్వలి లక్ష్మణ్, రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు వి.కృష్ణ పాల్గొన్నారు.

మహిళ వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి- భీమునిపట్నం : ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఏడాదిగా చికిత్స పొందుతున్న జివిఎంసి మూడో వార్డు నేరెళ్లవలస కాలనీకి చెందిన మహిళ కిరణ్మయికి వైద్య సహాయం నిమిత్తం స్థానిక ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం రూ.20 వేలు సాయం అందజేశారు. బాధితు రాలి తండ్రి ప్రభాకర్కు సాయం అందించినట్లు సంస్థ సభ్యులు కాళ్ల సన్నీ, ఎం సూర్య శ్రీనివాస్ తెలిపారు. సంస్థ సభ్యులు జి.సాయి, ఎం.శ్రీరామ్, ఎం.గోపి పాల్గొన్నారు

రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకోం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:రైల్వే కాంట్రాక్ట్ కార్మికులను తొలగిస్తే ఊరుకోమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం సిఐటియు ఆధ్వర్యంలో ఈస్ట్ కోస్ట్ రైల్వే అసిస్టెంట్ డివిజనల్ మేనేజర్ అభినకాంత్ బిస్వంన్కు వినతి పత్రం అందజేశారు.సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో అరుకు కేకే లైన్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను రైల్వే బోర్డు ప్రకటించిన కనీస వేతనాల జీవో అమలు చేయాలన్నారు. లేబర్ కమిషనర్ కి సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ కార్మికులను తొలగిస్తామని బెదిరింపులు చేస్తూ కార్మికులు పనికి రాకుండా ఆపారని, తక్షణం తొలగించే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు చెల్లించకుండా రైల్వే కాంట్రాక్టర్లు కార్మికుల శ్రమను దోచేస్తున్నారని మండిపడ్డారు. గతంలో అనేకసార్లు రైల్వే అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని దీంతో లేబర్ కమిషనర్ను కలిసి సమస్యలను వివరించడం జరిగిందని చెప్పారు. కాంట్రాక్టర్లు కార్మికులపై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడుతుండటం సరికాదన్నారు. బెదిరింపులకి భయపడద్దని తొలగించే ప్రయత్నం చేస్తే పెద్ద ఎత్తున కార్మికులతో ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి సన్యాసిరావు, మధు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ లబ్ధిదారుల ఇకెవైసి గడువు పొడిగించాలి

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లాలో రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ గడువు సుమారు మూడు నెలలు పొడిగించాలని ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచిపెంట చిన్నస్వామి డిమాండ్ చేశారు. అరకులోయ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులకు ఈకేవైసి ఈనెల 31 గడువు ముగుస్తుందని కూటమి ప్రభుత్వం, సంబంధిత అధికారులు ప్రకటించడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈకేవైసి చేసుకోవడానికి మారుమూల ప్రాంతాల నుండి మండల కేంద్రానికి వచ్చి చేసుకోవడం చాలా కష్టతరం అవుతుందని, కొందరికి ఆధార్ కార్డు సరిగా అప్డేట్ లేదని, దీంతో ఈకేవైసీ అవ్వలేదని తెలిపారు.ఈకేవైసీ అయితేనే ఏప్రిల్ నెలలో రేషన్ బియ్యం ఇస్తామని నిబంధనలు ప్రభుత్వం ప్రకటించడంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు వివిధ ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలో చదువుకుంటున్నారని, ఈ కేవైసీ కోసం రావడానికి ఇబ్బందికరంగా ఉంటుందని తెలిపారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి ఈ కేవైసీ గడువు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి భగత్ రామ్, బీసీ సెల్ నేత కె.పవన్, నాయకుడు కొర్ర గోవింద్ పాల్గొన్నారు.

గీతం ప్రవేశపరీక్ష 'గ్యాట్'కు స్పందన

గీతం ప్రవేశపరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్, ఫార్మశీ, ఆర్కిటెక్చర్, మేనేజ్మెంట్, సైన్స్, లా, నర్సింగ్, పారామెడికల్ కోర్సులలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఉమ్మడి ప్రవేశ పరీక్ష గీతం అడ్మిషన్ టెస్టు (గ్యాట్-2025)కు మంచి స్పందన లభించింది. దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాలలో ఎంపిక చేసిన 42 పట్టణాలలో తొలి విడతగా ఈనెల 28, 29 తేదీలలో ఈ ప్రవేశ పరీక్షను నిర్వహిస్తుండగా శుక్రవారం విశాఖ ప్రాంగణంలో ఆన్లైన్ ప్రశ్నా పత్రాన్ని గీతం ప్రో-వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్రావు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో గీతంలోని కోర్సులను నిర్వహిస్తున్నామని దాదాపు రూ.100 కోట్లతో సైన్స్ ప్రయోగశాలలను అభివృద్ధి చేశామని తెలిపారు. పరిశ్రమల సహకారంతో సిలబస్లో మార్పులు చేస్తూ ప్రస్తుత అవసరాలకు తగిన విధంగా కోర్సులలో మార్పులు చేస్తున్నామని వెల్లడించారు.

గీతం విద్యార్థులలో నైపుణ్యం పెంచడంతో పాటుఉద్యోగ అవకాశాలను మెరుగు పరచడానికి, విదేశీ విద్య అవకాశాలను పెంచుకోవడానికి, పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికి తగిన శిక్షణ అందించేందుకు గీతం కెరీర్ గైడెన్స్ సెంటర్ను (జిసిజిసి)ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. గీతం అడ్మిషన్ల డైరక్టర్ ఎమ్.జగదీష్ మాట్లాడుతూ గీతం ప్రవేశ పరీక్ష గ్యాట్-2025లో లభించిన మార్కుల ఆధారంగా వివిధ కోర్సులలో ప్రవేశాలు కల్పిస్తామని, ప్రతిభగల విద్యార్థులను పెద్దఎత్తున ప్రోత్సహించడానికి విద్యార్థులకు ప్రతిభ స్కాలర్షిప్లను అందిస్తున్నట్లు వెల్లడించారు. క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారికి గీతం ప్రవేశాలలో ప్రాధాన్యతతో పాటు స్కాలర్షిప్ అందచేస్తున్నామని తెలిపారు.

కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొపెసర్ కె.నాగేంద్రప్రసాద్, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్, వివిధ కళాశాల ఫ్యాకల్టీ సభ్యులు పల్గొన్నారు. కాగా ఈ ఏడాది ప్రవేశ పరీక్షకు గాను వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ విభాగాల నిపుణులు హజరై గీతం అందిస్తున్న కోర్సుల వివరాలను, విద్యారంగంలో వస్తున్న మార్పులను తల్లిదండ్రులకు వివరించారు. ఈ నెల 29న కూడా ప్రవేశ పరీక్ష జరగనుండటం తో విస్తృతంగా ఏర్పాట్లు చేసినట్లు అడ్మిషన్ల విభాగం అధికారులు వెల్లడించారు.

నేరాలు ఘోరాలు

మద్యం సీసాలు స్వాధీనం

మద్యం సీసాలతో పట్టుబడిన నిందితుడు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ కేంద్రంలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న పాంగీ సతీష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు ఎస్ఐ రామకృష్ణకు విశ్వసనీయత సమాచారంతో సిబ్బందితో తనిఖీలు చేశారు. గ్రామంలోని కిరాణా షాపులో తనిఖీలు చేయగా అక్రమంగా ఉంచిన సుమారు 30 మద్యం పెట్టెలను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. పాంగి సతీష్ ఆ సమయంలో దుకాణంలో లేకపోవడంతో, కుటుంబ సభ్యుడైన పాంగి మహేష్ బాబును అదుపులోకి తీసుకొన్నమని ౧ తెలిపారు. మధ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసామన్నారు. ఒక్కొక్క పెట్టిలో 48 సీసాలు కలిగి ఉన్నాయన్నారు. పట్టుబడ్డ మద్యం సుమారు రూ. 1,42, 470 విలువ కలిగి ఉంటుందని పేర్కొన్నారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

వడ్లపూడిలో ప్రేమికుల ఆత్మహత్య

ప్రజాశక్తి-ఉక్కునగరం : వడ్లపూడి ఆర్హెచ్.కాలనీలో ప్రేమజంట ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడింది. మృతుడి ని మర్రిపాలేనికి చెందిన అమీరుద్దీన్ఖాన్ (36)గా, మృతురాలిని సింహాచలం గోశాలకు చెందిన పిన్నింటి వెంకటదుర్గ (17)గా గుర్తిం చారు. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మర్రిపాలేనికి చెందిన మృతుడు అమిరుద్దీన్ ఖాన్ సింహాచలం గోశాల వద్ద మృతురాలు తల్లి జయశ్రీకి నడుపుతున్న హోటల్లో చెఫ్గా పనిచేసేవాడు. అమీరుద్దీన్ఖాన్ ప్రవర్తన బాగా లేని కారణంగా మృతురాలి తల్లి అతనిని పని నుంచి తొలగించింది.

అప్పటికే మృతులిద్దరి మధ్య ప్రేమ పరిచయం ఉండడంతో తర్వాత కూడా వారు కలుసుకునే వారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం మృతురాలి తల్లి జయశ్రీ హోటల్కు వెళ్లగానే, వెంకట దుర్గా చీరలు తెచ్చుకోవడా నికని బయటకు వెళ్ళిపోయింది. అనుమానం వచ్చిన తల్లి జయశ్రీ, అమీరుద్దీన్ ఖాన్ కోసం వాకబు చేసి, వడ్లపూడిలో అద్దెకు ఉంటున్న ఇంటికి వచ్చింది. గది తలుపుకు లోపల గడియ పెట్టి ఉండడంతో కిటికీల్లోంచి లోపలికి చూడా, ఇద్దరూ ఉరేసుకుని మృతి చెందినట్లు గుర్తించారు. మృతురాలి తల్లి జయశ్రీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా అమీరుద్దీన్ ఖాన్కు గతంలోనే వివాహం కాగా, నెల రోజుల క్రితమే విడాకులు తీసుకున్నాడు. మృతు రాలు పిన్నింటి వెంకటదుర్గ ఇంటర్ ఫస్టియర్ పూర్తిచేసింది

4న కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - పాడేరు : విశాఖపట్నం లోని హెచ్ సి జి కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో ఏప్రిల్ నాల్గవ తేదీ శుక్రవారం పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయం దగ్గర ఉచితంగా నిర్వహించనున్న కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు కేన్సర్ అనుమానిత ప్రజలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ హెచ్ సి జి కేన్సర్ సెంటర్ రూపొందించిన గోడ పత్రికలను, కరపత్రాలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్ సి జి కేన్సర్ సెంటర్ అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. రొమ్ము, గర్భాశయ కేన్సర్లకు ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాడేరు శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ కె. పద్మలత, స్థానిక సర్పంచ్ కె.ఉషారాణి, హెచ్ సి జి కేన్సర్ సెంటర్ మార్కెటింగ్ హెడ్ ధనుంజయరావు, ఆపరేషన్ హెడ్ స్వాతిక్, శ్రీ మోదకొండమ్మ ఉత్సవ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల దోపిడీకి టెండర్ల విధాన లోపమే కారణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కాంట్రాక్టర్ల దోపిడీకి టెండర్ల విధాన లోపమే కారణమని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట్ రెడ్డి అన్నారు. ఎంఎ, యుడి సర్క్యులర్లు, గైడ్లైన్స్, చట్టవిరుద్ధంగా జివిఎంసిలో పిఎఫ్, ఇఎస్ఐలు కలపకుండా ఎస్టిమేషన్లు వేసి టెండర్లు పిలుస్తూ కౌన్సిల్ను తప్పుదారి పట్టిస్తూ ఆమోదిస్తున్నారని, కార్మిక వివాదాలు రావడానికి ఇదే కారణమని పేర్కొన్నారు. ఎస్టిమేషన్లను రివైజ్ చేసి సరి చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆయన ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్, జివిఎంసి ఇన్ఛార్జి కమిషనర్ హరేంధిర ప్రసాద్కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.అనిల్ కుమార్, లోహియా కాంట్రాక్టు నాయకులు రమణ, శ్రీను, యశ్వంత్ పాల్గొన్నారు.

పోరాట ఫలితమే 'సహకార్ ట్యాక్సీ'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓలా, ఉబర్, రాపిడో డ్రైవర్ల పోరాటం కారణంగానే కేంద్ర ప్రభుత్వం 'సహకార్ ట్యాక్సీ'ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిందని విశాఖ క్యాబ్ డ్రైవర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్ అన్నారు. శుక్రవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉబర్, ఓలా, రాపిడో మొదలైన వాటికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఒక యాప్ను ప్రారంభిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి పార్లమెంటులో చేసిన ప్రకటనను తమ యూనియన్ స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రతిపాదిత యాప్తో డ్రైవర్లు, ప్రయాణికుల కష్టాలను, లోపాలను పరిష్కరించాలన్నారు. గూడ్స్ ట్రాన్స్పోర్ట్ వాహనాలను కూడా చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి పోల్నాయుడు, నాయకులు ఆనంద్, సుంకర అబ్బాయి, రామోను ప్రసాద్, రాజేష్ పాల్గొన్నారు.

సరుకు రవాణాలో విశాఖ పోర్టు రికార్డు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 91 ఏళ్ల ప్రస్థానంలో విశాఖపట్నం పోర్టు మరో చారిత్రక మైలురాయిని అధిగమించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 361 రోజుల్లోనే ఇప్పటి వరకు అత్యధిక సరుకును రవాణా చేసిన ఘనతను నమోదు చేసింది. 27 మార్చి 2025 నాటికి పోర్టు 81.28 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకును హ్యాండ్లింగ్ చేసి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 366 రోజుల్లో సాధించిన 81.09 మెట్రిక్ టన్నుల రికార్డును అధిగమించిందని పోర్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్ తెలిపారు.

పలు రైళ్లకు అదనపు కోచ్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని తగ్గించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ అధికారులు పలు రైళ్లకు అదనపు కోచ్లను పెంచాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 58506 విశాఖపట్నం - గుణుపూర్ ప్యాసింజర్ ఎక్స్ప్రెస్కు, 58505 గుణుపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్ప్రెస్కు ఏప్రిల్ 1 నుండి ఏప్రిల్ 30 వరకు, 58501 విశాఖపట్నం - కిరండూల్ ప్యాసింజర్ ఎక్స్ప్రెస్కు ఏప్రిల్ 12 నుండి ఏప్రిల్ 30 వరకు, 58502 కిరండూల్ - విశాఖపట్నం ప్యాసింజర్ ఎక్స్ప్రెస్కు ఏప్రిల్ 13 నుండి మే 1 వరకూ, 20809 సంబల్పూర్ - నాందేడ్ ఎక్స్ప్రెస్కు ఏప్రిల్ 4 నుండి ఏప్రిల్ 28 వరకు, 20810 నాందేడ్ - సంబల్పూర్ ఎక్స్ప్రెస్కు ఏప్రిల్ 5 నుంచి ఏప్రిల్ 29 వరకు ఒక అదనపు స్లీపర్ కోచ్ను పెంచనున్నారు.

జర్నలిస్టుల ఉగాది సంబరాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జర్నలిస్టుల రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించడం పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఎపి వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్, ఎపి బ్రాడ్ కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది నామ సంవత్సర. వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆంజనేయులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జర్నలిస్టులపై దాడులు పెరుగుతున్నాయని, అలాగే అనేక ప్రాంతాల్లో హత్యలు జరుగుతున్నాయని ఇటువంటి వాటికి అడ్డుకట్ట వేసేందుకు మీడియా కమిషన్ ఎంతగానో తోడ్పాటు అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ డికె బారువ, ఎసిఎ మీడియా మేనేజర్ జై కిషన్, ప్రముఖ సంఘ సేవకులు మట్టపల్లి హనుమంతరావు, శంకర్ ఫౌండేషన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బంగార్రాజు పాల్గొని మాట్లాడారు. జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, ఫెడరేషన్ విశాఖ జిల్లా కార్యదర్శి పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు, కె.మదన్, జగన్ మోహన్, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుజల స్రవంతిపై కూటమి కొత్త వ్యూహం

భూ సేకరణ జరపకుండానే పనులకు సిద్ధపడుతున్నట్టు హడావుడి
నదుల అనుసంధానం పేరుతో కేంద్ర సాయంపై ఆశలు
ప్రజలను బోల్తా కొట్టించే పనిలో ప్రభుత్వం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఉత్తరాంధ్ర ప్రజలను బోల్తా కొట్టించడానికి పూనుకుంది. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూ సేకరణ జరపకుండానే పనులకు సిద్ధపడుతోంది. గతంలో పిలిచిన టెండర్లకు జీవం పోయాలని చూస్తోంది. 2018లో ఫేజ్-1, 2021లో ఫేజ్-2 టెండర్లు పిలిచినా ప్రభుత్వాలు నిధులు విడుదల చేయని విషయం తెలిసిందే. ఈ సారి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులొస్తాయన్న ఆశతో నదుల అనుసంధానాన్ని కొత్తగా చేర్చి పనుల పేరిట హడావుడి చేస్తోంది. వాస్తవానికి బాబూ జగ్జీవన్రామ్ ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (బిజెఆర్యుఎస్ఎస్) ప్రాజెక్టుకు 2025-26 బడ్జెట్లో రూ.605.75 కోట్లు మాత్రమే కేటాయించారు. అవి ఎటూ చాలనప్పటికీ రూ.6,358 కోట్లు అవసరమైన సుజల స్రవంతి ప్రాజెక్టు భూ సేకరణ, ప్రధాన కాలువ పనులను మూడేళ్లలో పూర్తిచేస్తామని కూటమి ప్రభుత్వం నమ్మబలుకుతోంది. ఇంతవరకూ ఎకరా భూమి సేకరించకుండానే 2025 డిసెంబరు నాటికి విశాఖపట్నం పరిశ్రమలకు నీరు సరఫరా చేసేలా జలవనరుల శాఖాధికారులతో చిత్తుప్రతిని తయారు చేయించింది. తొలుత ఉమ్మడి విశాఖపట్నం జిల్లా తాళ్లపాలెం నుంచి ఉమ్మడి విజయనగరం జిల్లా గుర్ల మండలం గడిగెడ్డ రిజర్వాయర్ వరకు 101.57 కిలోమీటర్లలో ప్రధాన కాలువ నిర్మాణం పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పనుల కోసం 6,403 ఎకరాల భూమి సేకరించాల్సివుంది. కానీ ఇంతవరకు ఎకరం భూమిని కూడా సేకరించే ప్రక్రియను ప్రభుత్వం పూర్తిచేయలేదు. భూ సేకరణకు ప్రస్తుత అంచనా ప్రకారం రూ.2,577 కోట్లు, ప్రధాన కాలువ నిర్మాణ పనులకు రూ.3781 కోట్లు వ్యయం కానుంది. ఈ తీరున ఇటీవల విడుదల చేసిన బడ్జెట్లో నిధుల కేటాయింపు లేదు. భూమి సేకరించకుండా గతంలో పిలిచిన టెండర్లకు కొత్తగా అనుసంధాన రూపమిచ్చి పనులు చేయాలనుకుంటోంది. కాలువ నిర్మాణ పనులు జరగడానికి ముందు భూ సేకరణ ప్రక్రియ పూర్తిచేయాల్సివుంది. పనులకు టెండర్లు పిలిచి ఖరారైన తరువాత కాంట్రాక్టర్లకు భూమి అప్పగించాల్సివుంది. ప్రభుత్వం ఈ పనిచేయకుండా, తన చేతిలో ఎకరా భూమి కూడా లేకుండా మూడు ప్యాకేజీల కింద రూ.3,781 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచింది. నిర్మాణ పనులకు నిధులు కేటాయించడానికి చేతులురాని ప్రభుత్వం... నదుల అనుసంధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టవచ్చన్న ఆశతో వుంది. సుజల స్రవంతి 101.57 కిలోమీటర్ల ప్రధాన కాలువ నిర్మాణంలో శారద, గోస్తని, చంపావతి నదుల అనుసంధానం పనులను జోడించింది.

రూ.17,050.20 కోట్ల విలువైన బిజెఆర్యుఎస్ఎస్ ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు లభించనుంది. విశాఖ నగర ప్రజలకు, 48 మండలాల్లోని 1037 గ్రామాల్లోని 30 లక్షల మందికి తాగునీరు, పరిశ్రమలకు సరిపడా నీరు లభ్యం కానుంది. ఇంత విలువైన ప్రాజెక్టు పూర్తికి ప్రభుత్వం సరిపడా నిధులు కేటాయించకుండా కేంద్ర సాయంతో ప్రధాన కాలువను పూర్తి చేయాలని చేసిన కూటమి వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో వేచి చూడాలి. కేంద్రం నిధులు ఇవ్వకపోతే సుజల స్రవంతి పనులు ప్రశ్నార్థకంగా మారనున్నాయి.

మాట్లాడుతున్న ఉమాదేవి

గంజాయి సాగు, రవాణా నేరం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయతీ పరిధి లూసం, సాకులు పాలెం గ్రామాలలో గంజాయి సాగు నిర్మూలన కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో ఉమాదేవి గంజాయి సాగు రవాణా చేయడం చట్టరీత్యా పెద్ద నేరమని, గంజాయి సాగు రవాణాకు పాల్పడితే శిక్షార్హులని పేర్కొన్నారు. గంజాయి పంట వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా గిరిజన రైతులు గంజాయి సాగుకు దూరంగా ఉండాలని సూచించారు. దీనికిగాను వ్యవసాయ శాఖ ప్రదాయ సాంప్రదాయ పంటలైనటువంటి చోడు, సామ వంటి పంటలను సాగు చేయాలని సూచించారు. రైతులు సాగునీటిబోరు కొట్టించేందుకు అవకాశం కల్పించవలసిందిగా రెండు గ్రామాల్లో గిరిజనులును కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

నేడు రాజవొమ్మంగిలో జాబ్ మేళా

ప్రజాశక్తి రాజవొమ్మంగి : మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు జాబ్ మేళా కార్యక్రమం జరుగుతుందని ఉపాధి హామీ ఎపిఒ రెడ్డిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో విద్యార్హత టెన్త్ ఆపై చదివిన వారై, వయోపరిమితి 18 -35 లోపు వయసు కలిగిన యువతీ యువకులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని కోరారు. ఈ జాబ్ మేళాలో ఉపాధి పనులు 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాల వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం యు.చీడిపాలెం పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామం పలకజీడి వారపు సంతలో మావోయిస్టులకు వ్యతిరేకంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వారపు సంతకు వచ్చిన పలు గ్రామాల గిరిజనులు ఈ ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. మావోయిస్టు వారోత్సవాలు వద్దు, గిరిజనుల అభివృద్ధే ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వారపు సంతకు వచ్చిన పరిసర గ్రామ ప్రాంత గిరిజనులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అధ్యక్షునిగా లక్ష్మణరావు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రంపచోడవరం మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా రాజవొమ్మంగి మండలానికి చెందిన లోతా లక్ష్మణరావు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మాజీ సొసైటీ అధ్యక్షుడు కణజాల తాతారావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి నిస్వార్థంగా పనిచేసే వారిని పార్టీ ఎప్పుడూ గుర్తించి సముచిత స్థానాన్ని ఇస్తుందని తెలిపారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ఈ పదవికి లోతా లక్ష్మణ్రావును ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. లక్ష్మణరావుకు టిడిపి మండల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

కరూర్ వైశ్య బ్యాంక్ శాఖ ప్రారంభం

బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సంధ్యా దేవి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కరూర్ వైశ్య బ్యాంక్ (కెవిబి) నగరంలోని పూర్ణా మార్కెట్ మెయిన్ రోడ్డులో తమ నూతన శాఖను ఏర్పాటు చేసింది. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో డాక్టర్ సంధ్యా దేవి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కొత్త శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కెవిబి నూతన శాఖ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంత వాసులకు బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. దగ్గరలో బ్యాంకు ఉండడం వల్ల ప్రజలకు సమయం ఆదా అవ్వడంతో పాటు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ శాఖ పొదుపు, కరెంట్ ఖాతాలు సహా డిపాజిట్లు, రుణాలు వంటి సమగ్రమైన బ్యాంకింగ్ సేవలను అందిస్తుందని కరూర్ వైశ్యా బ్యాంక్ ప్రతినిధులు ఈ సందర్భంగా చెప్పారు. లాకర్ సదుపాయం కూడా ఈ శాఖ కలిగి ఉందని, కొత్త శాఖ అన్ని ప్రాథమిక బ్యాంకింగ్ లావాదేవీలను కస్టమర్ల నిర్దిష్ట అవసరాలను కూడా తీరుస్తుందని అన్నారు.

బిసిలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టర్ : దేశంలో 52 శాతం జనాభా కలిగిఉన్న బిసిలకు ప్రత్యేకంగా కేంద్రంలో మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అఖిలభారత ఒబిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు తులసపాటి కృష్ణంరాజు, కార్యదర్శి తణుకు సత్య వరప్రసాద్, మహిళా విభాగం ఉపాధ్యక్షులు కణితి మల్లేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.